రేపు గద్దర్ ఫౌండేషన్ సభ

ఉస్మానియా యూనివర్సిటీ: గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే సభను విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట వాల్ పోస్టర్‌ను గద్దర్ కుమారుడు సూర్యకిరణ్ ఆవిష్కరించి మాట్లాడారు. సాయంత్రం 5 గంటలకు ప్రశ్నించే గొంతులు–పాలకుల అణిచివేత సభకు విద్యార్థులు, మేధావులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సునీల్ శెట్టి, కోట శ్రీనివాస్‌గౌడ్‌లతో పాటు వివిధ విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు.

16న తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళనం

ఉస్మానియా యూనివర్సిటీ: ఈ నెల 16న సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో జరిగే తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు కంచర్ల బద్రి, విజయ్‌నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. తెలంగాణ ఉద్యమకారులను గత ప్రభుత్వం గుర్తించలేదని సీఎం రేవంత్ రెడ్డి గుర్తించి ఆదుకోవాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం



రసూల్‌పురా: వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో కార్ఖాన బస్టాపు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు ఏ. రామకృష్ణ, సెక్రటరీ జి. శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు ఏ. వెంకటేష్ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం


రాధిక

చిలకలగూడ: చిలకలగూడ ఠాణా పరిధిలో ఓ మహిళ అదృశ్యమైంది. ఎస్ఐ సవిత తెలిపిన మేరకు.. సీతాఫల్‌మండి మేడిబావికి చెందిన రాధిక (26) ముషీరాబాద్‌లోని ఓ సంస్థలో పనిచేస్తోంది. ఈనెల 2న ఉదయం ఆఫీస్‌కు అని చెప్పి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కార్యాలయానికి రాలేదని సిబ్బంది తెలిపారు. పలు ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఫలితం లేకపోవడంతో సోదరుడు గణేష్ పోలీసులను ఆశ్రయించాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ సవిత తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

అడ్డగుట్ట: అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెలిపిన మేరకు.. తుకారాంగేట్ ప్రధాన రోడ్డు మార్గంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న తుకారాంగేట్ పోలీసులు అతనిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించడంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

ఈ–బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఏర్పాటు చేయాలి

పంజగుట్ట: ఎకనామికల్లీ బ్యాక్‌వర్డ్ (ఈ–బీసీ) వర్గాల సంక్షేమం కోసం రాష్ట్రంలో ఈ–బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, ఈ–బీసీ కమిషన్, ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని ఈ–బీసీ సంక్షేమ సంఘం కేంద్ర కమిటీ జాతీయ అధ్యక్షుడు పల్లపు రెడ్డి రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ–బీసీల సంక్షేమం కోసం రూ.10 వేల కోట్లతో ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు.

నిమ్స్‌లో రోగి సహాయకుడి ఆత్మహత్య

పంజగుట్ట: కల్లుకు బానిసై కల్లు దొరకక ఓ రోగి సహాయకుడు నిమ్స్ ఆసుపత్రి రెండో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యా చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం..మంచిర్యాల జిల్లా, బెల్లంపల్లికి చెందిన హనుమాండ్ల పోశం (70) బాడీ మొత్తం ఇన్‌ఫెక్షన్ రావడంతో నిమ్స్ ఆసుపత్రికి నాలుగు రోజుల క్రితం అతని కుమారుడు హనుమాండ్ల నారాయణ (55), మరో కుమారుడు మధుకర్‌తో కలిసి వచ్చాడు. పోశంకు వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో చికిత్స అందిస్తున్నారు. తోడుగా వచ్చిన నారాయణకు ప్రతిరోజు కల్లు తాగే అలవాటు ఉందని, నగరంలో కల్లు ఎక్కడ దొరుకుతుందో తెలియక తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. మానసికంగా బాధపడుతున్న నారాయణ శుక్రవారం మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో నిమ్స్ ఆసుపత్రి స్పెషాలిటీ బ్లాక్ నుంచి ఎమర్జెన్సీ వార్డుకు వెళ్లే వంతెన రెండో అంతస్తు నుంచి కిందకు దూకాడు. స్పందించిన నిమ్స్ సిబ్బంది నారాయణను చికిత్స నిమిత్తం ఎమర్జెన్సీ వార్డుకు తరలించి వెంటిలెటర్‌పై చికిత్స అందించారు. తలకు తీవ్ర గాయం కావడంతో చికిత్స పొందుతున్న నారాయణ రాత్రి మృతి చెందాడు. నారాయణ సోదరుడు మధుకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఫుట్‌ఓవర్ వంతెనకు పర్యవేక్షణ కరువు


ఎస్కలేటర్ వద్ద చెత్తాచెదారం

పనిచేయని ఎస్కలేటర్లు
- చెడిపోయిన లిఫ్ట్‌లు
- ఎస్‌పీరోడ్డు వంతెన దుస్థితి

సికింద్రాబాద్: సికింద్రాబాద్ ఎస్‌పీ రోడ్డు సెయింట్ ఆన్స్ స్కూలు ఎదురుగా ఏర్పాటు చేసిన అధునాతన ఫుట్‌ఓవర్ వంతెన గురించి పట్టించుకునే వారే కరువయ్యారు. సుమారు రూ.2 కోట్ల వ్యయంతో ఇక్కడ జీహెచ్‌ఎంసీ అధికారులు ఫుట్‌ఓవర్ వంతెనను నిర్మించారు. మెట్లకు సమాంతరంగా ఎస్కలేటర్‌ను ఏర్పాటు చేయడంతోపాటు ఇరువైపులా లిఫ్టులు ఏర్పాటు చేశారు. ఇంత వరకు పరిస్థితి బాగానే ఉన్నప్పటికీ ఫుట్‌ఓవర్ వంతెన నిర్వహణ వ్యవహారాలు చూసేవారే కరువయ్యారు. లిఫ్టులు, ఎస్కలేటర్లు ఇప్పటికే చెడిపోయాయి. స్కూల్ సమయంలో మినహా ఈ వంతెనను వినియోగించే వారు తక్కువ సంఖ్యలోనే ఉంటుండడం గమనార్హం. కొద్ది మంది వినియోగించే ఫుట్‌ఓవర్ వంతెన నిర్వహణ వ్యవహారాల మాట అటుంచి కనీసం అందులో నిండిపోయిన చెత్తచెదారాలను తొలగించేవారే కరువయ్యారు. జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న వంతెన దిన దినం అధికారుల పర్యవేక్షణ కరువవుతుండడం విచారకరం.


ఫుట్‌ఓవర్ వంతెన వద్ద పనిచేయని లిఫ్టు

రాములోరి కల్యాణానికి ముమ్మర ఏర్పాట్లు


విద్యుత్‌దీపాలతో అలంకరించిన బాలాంజనేయస్వామి ఆలయం

చిలకలగూడ: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. పలు ఆలయాలను విద్యుత్ దీపాలు, పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారి కల్యాణాన్ని కనులారా వీక్షించేందుకు పలు ఆలయాల ప్రాంగణాల్లో ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. చిలకలగూడ సాయిబాబా సమేత బాలాంజనేయస్వామి ఆలయంలో ఫౌండర్ ట్రస్టీ నాగులూరి సాయిబాబా నేతృత్వంలో స్వామివారి ఏర్పాట్లు చేపట్టారు. శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 6న ఉదయం రాములవారి కళ్యాణం, పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, ఈటీ రాజేష్‌కుమార్‌లు తెలిపారు.

శాంతియుతంగా వేడుకలు నిర్వహించుకోవాలి

చిలకలగూడ: మతసామరస్యంతో శాంతియుత వాతావరణంలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించుకోవాలని చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్ సూచించారు. ఠాణా పరిధిలోని పలు ఆలయ నిర్వాహకులు, స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించే భక్తులు, ఆధ్యాత్మికవేత్తలతో శుక్రవారం సాయంత్రం ఠాణా ప్రాంగణంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సలహాలు, సూచనలు అందించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేపట్టాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. శ్రీరామనవమి వేడుకలకు సుమారు 200 మంది పోలీసులకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఠాణా పరిధిలో 13 ఆలయాల్లో స్వామివారి కల్యాణోత్సవానికి, 11 ప్రాంతాల్లో శోభాయాత్ర, ర్యాలీలకు దరఖాస్తులు అందాయన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్లు, నిర్వాహకులు, అర్చకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


ఆలయ నిర్వాహకులకు సూచనలిస్తున్న చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్

ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం


ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న బోర్డు సభ్యురాలు భానుక నర్మద మల్లికార్జున్

కంటోన్మెంట్: వర్షాల వల్ల ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తామని బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద మల్లికార్జున్ అన్నారు. అకాల వర్షానికి జలమయం అయిన ఆరో వార్డు పరిధిలోని శ్రీనివాస కాలనీ, సాయి బాబా కాలనీ, మర్రి రాంరెడ్డి కాలనీ, హర్షవర్ధన కాలనీ, సీతారాంపూర్ ప్రాంతాల్లో పర్యటించారు. దాఫెదర్ రామకృష్ణ, శానిటేషన సిబ్బంది సహకారంతో వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల అభివృద్ధి కోసం రూ. 30 కోట్లు మంజూరు అయినట్లు గత ఎమ్మెల్యే చెప్పారని అన్నారు. అది కేవలం మాటల వరకే పరిమితం అయిందన్నారు. కనీసం ప్రస్తుత ఎమ్మెల్యే శ్రీ గణేష్ సమస్య పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. స్థానిక బస్తీ వాసులు వెంకటేష్, గోపాల్ గౌడ్, స్వరూప,మాలాద్రి, నాగేశ్వర్ రావు, కె ఎస్ ఎం శాస్త్రి పాల్గొన్నారు.

7 నుంచి మహా కుంభాభిషేకం

రాంగోపాల్‌పేట్: శివాజీనగర్‌లోని పెరుమాళ్ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు మహా కుంభాభిషేక ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ నర్సారెడ్డి తెలిపారు. శుక్రవారం దేవాలయంలో ఆలయ ఈవో కేబీ సత్యమూర్తి తో కలిసి వివరాలు వెల్లడించారు. 200 ఏళ్ల పైబడిన చరిత్ర కలిగిన దేవాలయాన్ని గత ఏడాదిన్నర కాలంగా జీర్ణోద్ధరణ చేపట్టినట్లు వెల్లడించారు. ఈ పనులు పూర్తి కావడంతో 7వ తేదీ నుంచి పూజలు మొదలు పెడుతున్నట్లు వెల్లడించారు. 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు వివిధ రకాల పూజలు జరుగుతాయని వివరించారు.

మహా కుంభాభిషేకానికి రండి

రాంగోపాల్‌పేట్: మహా కుంభాభిషేకానికి హాజరు కావాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను నిర్వాహకులు ఆహ్వానించారు. శుక్రవారం దేవాలయ చైర్మన్ వై నర్సారెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి ప్రత్యేకంగా ఆహ్వానించారు.


మహా కుంభాభిషేక కరపత్రాన్ని విడుదల చేస్తున్న చైర్మన్ నర్సారెడ్డి తదితరులు


ఎమ్మెల్యేకు ఆహ్వానం అందజేస్తున్న ఆలయ చైర్మన్

నేటి నుంచి కాంక్రీట్ మిల్లర్ల బంద్

పంజగుట్ట: లేబర్ కూలీల రేట్లు విపరీతంగా పెరిగినందువల్ల కాంక్రీట్ మిల్లర్ రేట్లు పెంచాలని తెలంగాణ కాంక్రీట్ మిల్లర్ ఓనర్ అండ్ లేబర్ యూనియన్ డిమాండ్ చేసింది. తగ్గుతున్న రేట్లకు నిరసనగా ఈ నెల 5 నుంచి 12వ తేదీ వరకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంక్రీట్ మిల్లర్ల బంద్ పాటిస్తున్నట్లు, 10న ఇందిరాపార్క్ వద్ద భారీ ధర్నా నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కాంక్రీట్ మిల్లర్ల బంద్ పోస్టర్‌ను యూనియన్ గౌరవాధ్యక్షుడు రేపల్లె కృష్ణా వాల్మీకి, చైర్మన్ వి.నాగరాజు, కన్వీనర్లు బినం గోపాల్, రవికుమార్ రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..వంద శాతం రిస్క్‌తో పనిచేస్తున్న కాంక్రీట్ మిల్లర్‌ను బిల్డర్లు, మేస్త్రీలు, సెంట్రింగ్ కాంట్రాక్టర్లు ఓనర్ల వద్ద పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని తమకు నామమాత్రంగా ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వంద గజాల నుంచి, 500గజాల వరకు ఒక్కరోజుకు కేవలం 12 వేలు మాత్రమే ఇస్తున్నారని అందులోనే లేబర్ కూడా చూసుకోవాలంటున్నారని లేబర్ ఖర్చులు పోను తమకు ఏమీ మిగలడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రేటర్‌లో దాదాపు లక్ష కాంక్రీట్ మిల్లర్ యంత్రాల ఓనర్లు ఉన్నారని వీరిని ఆధారం చేసుకుని సుమారు 10 లక్షల మంది లేబర్ ఉంటారని 10 లక్షల మందికి ఉపాధి ఇస్తున్న కాంక్రీట్ మిల్లర్‌లను కాపాడుకోవాలని వారు కోరారు. మిల్లర్, లిఫ్ట్, వైబ్రెటర్‌కు ఒకరోజుకు 12 వేల అద్దె ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఘనంగా 'సర్వే' జన్మదిన వేడుకలు



కంటోన్మెంట్: కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. మహేంద్రా హిల్స్‌లోని ఆయన నివాసంలో నిర్వహించిన వేడుకల్లో అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఫరూక్ హుస్సేన్, తెలంగాణ టూరిజం మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్, కూకట్‌పల్లి సీనియర్ కాంగ్రెస్ నేత సతీష్ రెడ్డి, మల్కాజ్‌గిరి పార్లమెంటరీ పరిధిలోని పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓయూలో సాంస్కృతిక పోటీలు ప్రారంభం




ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ శుక్రవారం అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీలు ప్రారంభమయ్యాయి. స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వీసీ ప్రొ.కుమార్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించి మాట్లాడారు. రెండు రోజులు జరిగే పోటీలకు ఓయూ పరిధిలోని 188 డిగ్రీ, పీజీ కాలేజీలకు చెందిన 900 మంది విద్యార్థులు పాల్గొనున్నట్లు అధికారులు తెలిపారు.

రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి


ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ ప్రీతంను ఆహ్వానిస్తున్న నాయకులు

లాలాపేట: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువత కోసం అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం పథకాన్ని అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ నాగరిగారి ప్రీతమ్ అన్నారు. శుక్రవారం తార్నాక మున్సిపల్ డివిజన్‌కు చెందిన మాదిగ సంఘాల నాయకులు ఆయన నివాసంలో కలిశారు. ఈ నెల 5 శనివారం శాంతినగర్‌లో నిర్వహించ తలపెట్టిన డా. బాబు జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవాలకు రావాలని కోరుతూ ఆహ్వానాన్ని అందజేశారు.

బీజేపీ నేత గిరికి పలువురి పరామర్శ



పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బీజేపీ సీనియర్ నాయకులు, బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా మజ్దూర్ మోర్చా కన్వీనర్ ఎస్‌వై గిరికి ఇటీవల గుండెపోటు వచ్చింది. దీంతో కుటుంబీకులు ఆయనను ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో స్టంట్ వేయించారు. ఆసుపత్రిలో శస్త్రచికిత్స అనంతరం అరుణ్‌జ్యోతి కాలనీలోని ఇంట్లో ఉంటున్న గిరిని పలు పార్టీలకు చెందిన నాయకులు ఎస్.వై గిరిని పరామర్శించారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర నాయకులు మర్రి పురురవరెడ్డి అరుణ్‌జ్యోతి కాలనీలో ఉన్న గిరిని పరామర్శించారు.

కర్మచారీల కుటుంబాలపై కారుణ్యం చూపండి

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో కారుణ్య నియామకాలకు సంబంధించి 5 శాతం సీలింగ్‌ను ఎత్తేయాల్సిందిగా ఎంపీ ఈటల రాజేందర్, కేంద్ర మంత్రి జితేందర్ సింగ్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంత్రిని కలిసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో సఫాయి కర్మచారీలు అత్యంత దుర్భర పరిస్థితుల్లో పనిచేస్తుంటారని పేర్కొన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ సేవలు అందించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో గత కొన్నేళ్లలో వంద మందికి పైగా కంటోన్మెంట్ సిబ్బంది, విధుల్లో ఉండగానే మత్యువాత పడ్డారని తెలిపారు. కారుణ్య నిమాయకాల్లో ఉన్న 5 శాతం సీలింగ్ వల్ల చాలా మంది ఉద్యోగం పొందే అవకాశం లేకుండా పోయిందన్నారు. డీమ్డ్ మున్సిపాలిటీ అయిన కంటోన్మెంట్‌లో ఒక్కసారి 5శాతం సీలింగ్ ఎత్తేసి, అర్హులైన వారందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. కంటోన్మెంట్‌లో 123 మంది కారుణ్య నియామకాల కోసం ఎదురుచూస్తుండగా, 5శాతం సీలింగ్ కారణంగా 22 మందికి మాత్రమే ఉద్యోగం వచ్చిందన్నారు. సీలింగ్ ఎత్తేసి, మిగిలిన 101 మందికి సైతం ఉద్యోగం ఇవ్వాల్సిందిగా కోరుతున్నామన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్, చిత్రంలో కంటోన్మెంట్ ఉద్యోగుల సంఘం నేత పరుశరామ్

సందడి చేసిన విద్యార్థులు



రసూల్‌పురా: బాలంరాయి విమాన నగర్‌లోని మమతా హైస్కూల్ ప్రీప్రైమరీ స్కూల్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరెస్పాండెంట్ ఇందిరా రాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బేగంపేట ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ ఎస్. వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి.

రాంగోపాల్‌పేట్: నల్లగుట్ట (ఓల్డ్) ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో యూకేజీ పూర్తి చేసుకున్న విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే ఉత్సవాలు అలరించాయి. అందమైన, రంగురంగుల దుస్తులతో ముస్తాబై వచ్చిన చిన్నారులకు కార్పొరేట్ పాఠశాలల స్టైల్లో గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. విద్యా శాఖ మాజీ డిప్యూటీ ఐవోఎస్ సుమన్ రాథోడ్ హాజరయ్యారు.



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి


ప్రభుత్వ పాఠశాల అడ్మిషన్ల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించే విషయంలో తల్లితండ్రులకు అవగాహన కల్పించాలని చడం కోసం కాలనీలు, బస్తీల ప్రజలు సహకారం అందించాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ కోరారు. శుక్రవారం తన నివాసంలో చిలకలగూడ దూద్‌బావికి చెందిన ప్రభుత్వ పాఠశాల అడ్మిషన్ల కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన వసతులను అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయించామని త్వరలో వాటికి భవన సముదాయాల నిర్మాణ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: కిలో టమాట రూ.13, నల్లవంకాయ.18, పొడుగువంకాయ.23, బెండకాయ.35, పచ్చిమిర్చి.40, బజ్జిమిర్చి.40, క్యాప్సికం.38, పచ్చికాకరకాయ.35, పందిరిబీర.35, క్యాబేజీ.09, క్యారెట్.17, దొండకాయ.23, గుండు బీన్సీస్.65, గింజచిక్కుడు.50, గోకరకాయ.35, కీర.13, దోసకాయ.18.



బొల్లారం చెక్‌పోస్ట్ వద్ద నూతన బస్ షెల్టర్ ప్రారంభం

బొల్లారం: బొల్లారం చెక్ పోస్ట్ వద్ద మార్పు ఫౌండేషన్' ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ ను నార్త్ డిస్ట్రిక్ట్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వేణు గోపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ మాట్లాడుతూ, ప్రయాణికులు బస్ షెల్టర్ ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం బస్సు షెల్టర్ ఏర్పాటు చేయడం పట్ల మార్పు ఫౌండేషన్ సభ్యులను అభినందించారు.కార్యక్రమంలో నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు, సీఐ మధు బాబు, ఎస్ఐ శ్రీకాంత్, హకీంపేట్ బస్ డిపో మేనేజర్ భవ భూతి పాల్గొన్నారు.


బస్ షెల్టర్ ను ప్రారంభిస్తున్న నార్త్ డిస్ట్రిక్ట్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వేణుగోపాల్ రెడ్డి

హకీంపేటలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ పర్యటన

బంజారాహిల్స్: నగరంలో కురిసిన వర్షాలకు హకీంపేట వరద ప్రవాహం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొకుండా శాశ్వత పరిష్కారం చేసేందుకు పూర్తి ప్రణాళికను సిద్ధం చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి ఎస్.ఈ.రత్నాకర్, ఇతర అధికారులతో కలిసి వరద ముంపునకు గురైన ప్రాంతాలను కమిషనర్ పరిశీలించారు. బంజారాహిల్స్, ఎమ్మెల్యే కాలనీ, లోటస్ పాండ్ నుంచి వర్షపు వరద ప్రవాహం హకీంపేట్ నుంచి బల్కం చెరువులోకి వెళ్తున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు కమిషనర్‌కు వివరించారు. గతంలో వరదరాలేదని, ఇటీవల కురిసిన వర్షాలకు హకీంపేట్‌కు లేఔట్ మట్టితో వరద వస్తుందని తెలిపారు.

మార్కెట్‌లో కమీషన్ ఏజెంట్ల ధర్నా

కంటోన్మెంట్: బోయిన్‌పల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మార్కెట్ యార్డులో శుక్రవారం కమీషన్ ఏజెంట్లు ధర్నా నిర్వహించారు. మార్కెట్ యార్డు కమిషన్ ఏజెంట్ల సంఘం అధ్యక్షుడు సోమ దేవేందర్ రెడ్డి పార్క్ చేసిన కారును అక్కడి నుంచి తీయాలని పార్కింగ్ కాంట్రాక్టర్ చరణ్ కోరడంతో ఇద్దరి మధ్యా వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో చరణ్‌పై దేవేందర్ రెడ్డి చేయి చేసుకున్నట్లు తెలుస్తోంది. వెంటనే చరణ్ మార్కెట్ కమిటీ చైర్మన్, సెక్రెటరీలకు ఫిర్యాదు చేశాడు. దేవేందర్ రెడ్డిని మార్కెట్ కమిటీ చైర్మన్ తన కార్యాలయానికి పిలిపించాడు. అయితే.. మార్కెట్ కమిటీ చైర్మన్ దురుసుగా ప్రవర్తిస్తున్నాడంటూ కమీషన్ ఏజెంట్లు శుక్రవారం ఉదయం ధర్నాకు దిగారు. ఈ వివాదం పికెట్‌లోని ఎమ్మెల్యే శ్రీగణేశ్ వద్దకు వెళ్లడంతోఆయన ఇరు వర్గాలకు సర్దిచెప్పారు.



సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379